ప్రజాశక్తి
బుధవారం 1 అక్టోబర్ 2025 5
శ్రీ సత్యసాయి

వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉండాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనూ, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉండాలని కలెక్టర్ శ్యాం ప్రసాద్ వైద్యులకు సూచించారు. ఈ మేరకు ఆయన మంగళవారం పుట్టపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (యనమల పల్లి) ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారిని, మరియు సిబ్బందిని, పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. యనమలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మందులు కొరత ఉన్న విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. మందులు కొరత ఉన్నప్పుడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో తీసుకోవాలని అక్కడ కూడా అందుబాటులో లేని పక్షాన ప్రైవేట్ మెడికల్ స్టోర్లలో కొని ప్రజలకు అందుబాటులో ఉంచాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రానికి వచ్చిన ప్రజలను కలెక్టర్ పలుకరించారు. కేంద్రంలోని సిబ్బంది ప్రజలకు ఎలాంటి సమయాల్లోనైనా వైద్య సేవలు అందించడానికి ముందుకు రావాలని సూచించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు.

విజృంభిస్తున్న విషజ్వరాలు

- రోగులతో ప్రభుత్వ, ప్రయివేటు ఆసుపత్రులు కిటకిట
- జిల్లా ఆసుపత్రిలో బెడ్లు లేక ఇబ్బంది పడుతున్న రోగులు
- పని ఒత్తిడి భరించలేమంటున్న నర్సింగ్ సిబ్బంది
- పట్టించుకోని పాలకులు...అధికారులు

ఒకే మంచంపై ఇద్దరిని, ముగ్గురిని పడుకో పెట్టిన దృశ్యం

ప్రజాశక్తి-హిందూపురం

ఇటీవల వాతవరణంలో మార్పులు చోటు చేసుకోవడం....అడపదడపా వర్షాలు కురవడంతో జ్వరాలు విజృంభిస్తున్నాయి. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో జ్వరాలు తీవ్రంగా ఉండడంతో ప్రభుత్వ, ప్రయివేటు ఆసుపత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. పట్టణంలోనిజిల్లా అసుపత్రికి ప్రతి రోజు 800 నుంచి 1200 మంది వరకు రోగులు వచ్చి చికిత్స పొందగా పట్టణ ఆరోగ్య ఉప కేంద్రాల్లో సైతం 100 నుంచి 150 మంది వరకు అవుట్ పేషెంట్లుగా వస్తున్నారు. దీంతో పాటు పట్టణంలో ఏ ప్రయివేటు అసుపత్రి చూసినా కిటకిటలాడుతోంది. వర్షాలతో వాతావరణం మారడంతో మలేరియా, టైఫాయిడ్, డెంగీ, గొంతు జ్వరాలు, డయేరియా బారిన ప్రజలు పడుతున్నారు. అపరిశుభ్రత వల్లనే వ్యాధులు ప్రబలుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు కురవడంతో దోమలు, ఈగలు వృద్ధి చెంది ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని వైద్యులు చెబుతున్నారు. బయట ఆహారాన్ని తీసుకోకుండా వేడి చేసి చల్లార్చిన నీటిని తాగాలని సూచిస్తున్నారు. పరిసరాలను, బాత్ రూములను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. సాధారణ జ్వరం వచ్చి 24 గంటల్లో తగ్గకపోతే వైద్యులను సంప్రదించాలని సూచిస్తున్నారు.

వైద్యం అంతంత మాత్రమే..

శ్రీ సత్య సాయి జిల్లాలో జిల్లా స్థాయి హోదా ఉన్నా ఏకైక అసుపత్రి హిందూపురం జిల్లా ప్రభుత్వ అసుపత్రి. ఈ అసుపత్రికి పట్టణ ప్రజలతో పాటు నియోజక వర్గంలోని అన్ని గ్రామాల ప్రజలు, పెనుకొండ, గోరంట్ల, మడకశిర తదితర నియోజక వర్గ ప్రజలతో పాటు కర్నాటక రాష్ట్రం నుంచి సైతం రోగులు వైద్య సేవల కోసం వస్తున్నారు. ప్రస్తుతం ప్రతిరోజు 800 నుంచి 1200 వరకు ఓపి నమోదు అవుతుంది. ఇది ఒక్కోసారి 1500 సైతం దాటుతుంది. ఈ అసుపత్రి సామర్థ్యం 200 పడకలే, అయినా ఇక్కడ ఒక్క చిన్న పిల్లల విభాగంలోనే 130 నుంచి 150కి పైగా ఇన్ పేషంట్లు వైద్య సేవలు పొందుతుంటారు. రోగుల తాకిడి పెరగడంతో ఆసుపత్రి కిటకిటలాడుతోంది. దీంతో ఒక బెడ్ పై ఇద్దరు, ఒక్కోసారి ముగ్గరు చొప్పున రోగులు సర్దుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. స్థాయికి మించి రోగులు రావడం, సిబ్బంది పూర్తి స్థాయిలో లేక పోవడంతో వచ్చే రోగులకు వైద్య సేవలు అంతంత మాత్రమే అందుతున్నాయి.

పెరుగుతున్న రోగులు....అరకొర వసతులు

హిందూపురం జిల్లా ప్రభుత్వ అసుపత్రిలో రోజు రోజుకూ రోగుల సంఖ్య పెరుగుతోంది. అరకొర వసతులు ఉండడంతో వచ్చే రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోగుల తాకిడి మరింత పెరిగింది. ప్రతిరోజు అన్ని విభాగాలు కలిపి సగటున 800 నుంచి 1200 ఒపి నమోదు అవుతోంది.. కంటి, ఆర్థోపెడిక్, మానసిక రోగుల విభాగాలకు సంబంధించి సదరన్ సర్టిఫికెట్ వెరిఫికేషన్ జరగుతుండటంతో దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారితో మరింత రద్దీ పెరిగింది. ఆసుపత్రిలో రోగులకు, వారికి తోడుగా వచ్చే బంధువులకు సరిపడే కుర్చీలు, టేబుళ్లు లేకపోవడంతో గంటల తరబడి నిల్చొనిఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రతిరోజు వందల సంఖ్యలో రక్త, మూత్ర పరీక్షలు చేసే గది ఇరుకుగా ఉండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏరియా స్థాయి నుంచి జిల్లా స్థాయి ఆసుపత్రిగా హోదా పెరిగినప్పటికీ ఏరియా అసుపత్రిలో ఉండే సౌకర్యాలు సైతం లేవు. ప్రభుత్వ అసుపత్రిలో విధులు నిర్వహించే వైద్యులు కొందరు సమీపంలోనే క్లినిక్‌లు ఏర్పాటు చేసుకొని ఆసుపత్రికి వచ్చే రోగులను వారి సొంత క్లినిక్‌లకు రెఫర్ చేయడంతో సక్రమంగా వైద్య సేవలు అందడం లేదన్న విమర్శలు ఉన్నాయి. దీనికి తోడు వైద్యులు సమయపాలన పాటించడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కలెక్టర్ స్పందించాలి

హిందూపురం జిల్లా ప్రభుత్వ అసుపత్రికి జిల్లా కలెక్టర్ ఛైర్మన్‌గా ఉన్నారు. కలెక్టర్ ఛైర్మన్‌గా ఉన్న అసుపత్రిలో అకకొర సౌకర్యాలతో రోగులు ఇబ్బంది పడుతున్నారు. ఒక పక్క రోగుల సంఖ్యకు తగ్గట్టు బెడ్లు లేవు, మరో పక్క బెడ్ల సంఖ్యకు తగ్గట్లు నర్సింగ్ సిబ్బంది లేరు. ఉన్న సిబ్బందిపై పని భారం పెరుగుతూ ఉంది. నూతనంగా భాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ మధ్యహ్నం 12 గంటల తర్వాత అసుపత్రిని ఆకస్మిక తనిఖీ చేస్తే ఏ వైద్యులు అందుబాటులో ఉన్నారు...ఏ వైద్యులు సంతకాలు పెట్టి వారి క్లినిక్‌లో ఉన్నారు అన్న విషయాలు తెలిస్తాయి. ప్రత్యేక శ్రద్ధ తీసుకొంటే వచ్చే రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందే అవకాశాలు ఉన్నాయి.

ఓపి చీటీ కోసం క్యూ కట్టిన రోగులు

చిన్నారులతో కిట కిటలాడుతున్న చిన్న పిల్లల వార్డు

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి సవిత, తదితరులు

మాట నిలబెట్టుకున్నాం : మంత్రి సవిత

ప్రజాశక్తి- సోమందేపల్లి

ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటను నిలబెట్టుకొన్నామని మంత్రి సవిత పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని బుసయ్యగారిపల్లి వద్ద రూ. 3 కోట్ల నిధులతో మంజూరైన బిటి రోడ్డు నిర్మాణానికి నిర్వహించిన భూమి పూజ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల నాయకులు, కార్యకర్తలు మంత్రికి ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన రంగుల రెడ్డి ఐదు సంవత్సరాలలో రాష్ట్రాన్ని రావణ కాష్టం చేశారని విమర్శించారు. గాలికొచ్చిన పార్టీని ప్రజలు గాల్లోనే కలిపారన్నారు. 3 కోట్ల రూపాయలు నిధులతో 9 కిలోమీటర్లు నిర్మించనున్న నూతన రోడ్డుతో సోమందేపల్లి, గోరంట్ల మండలాల ప్రజలకు ఎంతో అనుకూలంగా ఉంటుందన్నారు. 2024 ఎన్నికల ప్రచారంలో బుసయ్య గారి పల్లి ప్రజలకు మాట ఇచ్చానని చెప్పారు. భూమి పూజ చేయడానికి మీ ఊరికి వస్తా అని నాడు హామీ ఇచ్చానని, ఇచ్చిన మాట ప్రకారం నేడు భూమి పూజ చేశానని అన్నారు. ఎన్నికల హామీల్లో ఇచ్చిన మాట ప్రకారం సూపర్ సిక్స్ పథకాలను చంద్రబాబు నాయుడు అమలు చేస్తున్నారన్నారు. త్వరలో అర్హులైన అందరికి పక్కా ఇళ్లు నిర్మిస్తామన్నారు. అనారోగ్యాల పాలైన పేద ప్రజలకు, జర్నలిస్టులకు ఇరవై ఐదు లక్షల వరకు ఇన్సూరెన్స్ కల్పించిన ఏకైక ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ వెంకటేశులు, రాష్ట్ర ఉప్పర కార్పొరేషన్ ఛైర్మన్ వెంకటరమణ, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ డివి ఆంజనేయులు, హిందూపురం పార్లమెంట్ కార్యదర్శి నీరుగంటి చంద్రశేఖర్, నాయకులు భానుకీర్తి, సంజీవరెడ్డి, చల్లాపల్లి రామకృష్ణ, సిద్ధ లింగప్ప, మాగేచెరువు సర్పంచి నరసింహులు, చాకర్లపల్లి శ్రీరాములు, పట్టణ అధ్యక్షులు వడ్డే సురేష్, మాజీ ఎంపీటీసీ కిష్టప్ప, ఉప్పర బాబయ్య, శ్రీనివాస్ రెడ్డి రామాంజనేయులు, ముద్దిలేటి, నల్గొంద్రాయునిపల్లి, హరికృష్ణ, రమణప్ప, తుంగోడు అనిల్, ఇర్ఫాన్ ఖాన్, ఆది, జనసేన నాగరాజు, కూటమి నాయకులు, కార్యకర్తలు అధికారులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి-గుడిబండ

మండలంలోని ఎన్ఆర్.రొప్పం గ్రామానికి చెందిన సన్నీరమ్మ అనే మహిళ మృతి చెందింది. ఆ గ్రామానికి చెందిన కంచెగౌడ్ ద్వారా విషయం తెలియడంతో జ్ఞాన వృక్ష ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు వరప్రసాద్ మంగళవారం ట్రస్ట్ సభ్యులతో కలిసి సన్నీరమ్మ ఇంటికి వెళ్లి ఆమె కుటుంబ సభ్యులను రూ. 3వేల అందజేశారు. అలాగే సన్నీరమ్మ మనవరాలు లిఖిత ఇంటర్మీడియట్ చదువు పూర్తయ్యేంత వరకూ ట్రస్ట్ ద్వారా చదివిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాఘవేంద్ర, మంజునాథ్, గోపాల్, క్రిష్టప్ప, గ్రామస్తులు పాల్గొన్నారు.

సాధించిన ట్రోఫీని చూపుతున్న విద్యార్థులు

జాతీయ స్థాయి పెంకాక్ సిలాట్ విజేతలుగా జిల్లా విద్యార్థులు

ప్రజాశక్తి-హిందూపురం

కర్నాటక రాష్ట్రం కొప్పల్ లో జరిగిన 13వ జాతీయ స్థాయి సింగ, మకాన్, ప్రీ టీన్ , ప్రీ జూనియర్, జూనియర్ పెంకాక్ సిలాట్ పోటీల్లో వివిధ రాష్ట్రాలకు చెందిన యువకులు ప్రతిభ కనపర్చారు. శ్రీ సత్య సాయి జిల్లా నుండి పాల్గొన్న క్రీడాకారులు ప్రీ టీన్ విభాగంలో బంగారు పతాకాన్ని సాధించారు. ఎం. తనీశ్వర్ రెడ్డి బంగారు పతాకాన్ని సాధించగా జూనియర్ ట్యాండింగ్ విభాగంలో ఎం.మదీహ భాను సిల్వర్ మెడల్ సాధించింది. సింగ ట్యాండింగ్ క్యాటగిరిలో అఫీఫా కౌసర్ బ్రాంజ్ మెడల్ సాధించింది. అలాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభను ప్రదర్శించారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఆంధ్రప్రదేశ్ పెంకాక్ సిలాట్ సీఈవో డాక్టర్ పూరిమిట్ల మనోజ్ సాయి, కార్యదర్శి భరద్వాజ్ రెడ్డి, కోశాధికారి జనార్ధన్ రెడ్డి, పి.రఫీక్అహ్మద్, కోచ్ లు రియాజ్ భాషా, ఎన్.ఆర్ ప్రవీణ్ కుమార్ లు అభినందించారు.

సబ్సిడీ రుణమందేనా..?

ఏడాదిగా నిరీక్షణ

బిసి, ఇబిసి రుణాల కోసం ఎదురుచూపు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

బిసి, ఈబిసికి చెందిన యువత స్వయం ఉపాధి కోసమని రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ రుణాలను 2024-25లో మంజూరు చేసింది. ఈ మేరకు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ కూడా ముగిసింది. కాని ఇప్పటికీ లబ్ధిదారులకు మాత్రం ఆ రుణాలు అందలేదు. సబ్సిడీ రుణమిస్తే చిరు వ్యాపారాలు ప్రారంభించుకుందామని భావించిన వారికి ఎదురు చూపులు తప్పడం లేదు. ఈ రుణాలు మంజూరు చేయిస్తామని కొంత మంది లబ్ధిదారుల నుంచి డబ్బులు కూడా వసూలు చేసిన దాఖలాలున్నాయి. డబ్బులు పోయి రుణమూ రాకపోయే అన్న చందంగా వారి పరిస్థితి తయారైంది.

2024 -25 ఆర్థిక సంవత్సరంలో స్వయం ఉపాధి పథకం ద్వారా బిసి సబ్సిడీ రుణాల మంజూరు కొరకు 3200 యూనిట్లు మంజూరు చేశారు. దీనికి రూ.30.46 కోట్లు మంజూరు చేశారు. ఈబిసి సబ్సిడీ రుణాల కోసమని 412 యూనిట్లు మంజూరయ్యాయి. రూ.3.57 కోట్లు సబ్సిడీ ఉంది. ఇక కాపు సబ్సిడీ రుణాల కింద 689 యూనిట్లు మంజూరయ్యాయి. దీనికి రూ.11.58 కోట్లు మంజూరు చేశారు. ఇక జనరిక్ మందుల దుకాణాల కోసమని 50 శాతం సబ్సిడీతో బిసిలకు 65 యూనిట్లు మంజూరు చేశారు. దీనికి రూ.2.50 కోట్లు సబ్సిడీ ఇవ్వనున్నారు. ఈబిసి జనరిక్ మెడికల్ దుకాణాలకు 69 యూనిట్లు మంజూరయ్యాయి. దీనికిగానూ రూ.2.76 కోట్లు సబ్సిడీ మంజూరైంది. మంజూరైన లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తయింది. అయితే ఇప్పటి వరకు రుణాలు మాత్రం మంజూరవలేదు. ఇక 2025-26 సంవత్సరంలో కొత్త రుణాలు ఇస్తారా లేదా అన్నది తెలియలేదు. గతేడాది మంజూరైనవే ఇప్పటికీ గ్రౌండ్ అవలేదు. మొత్తంగా జిల్లాలో 4435 యూనిట్లు మంజూరయి ఉన్నాయి. రూ.50.97 కోట్లు సబ్సిడీ మొత్తం మంజూరైంది. లబ్ధిదారులకు ఇది అందేది ఎప్పుడో చూడాల్సి ఉంది.

సొమ్ములు పోయే రుణమూ అందకపోయే ...

లబ్ధిదారుల ఎంపిక సమయంలో కొంతమంది దళారులు రుణమిస్తామంటూ పెద్ద మొత్తంలోనే డబ్బులు వసూలు చేశారు. సబ్సిడీలో సగానికిపైగా వారివ్వడానికి అంగీకరించిన వారూ కొంత మంది ఉన్నారు. పోతే పోయింది. ఇప్పుడు రుణమైనా అందిందా అంటే అదీ లేకుండా ఉంది. గట్టిగా అడగలేని పరిస్థితి ఉండటంతో ఏమి చేయాలో పాలుపోని పరిస్థితి నెలకొంది.

రుణాలు మంజూరు చేయాలి : వి.రామిరెడ్డి సిపిఎం నగర కార్యదర్శి

సబ్సిడీ రుణాల కోసం లబ్ధిదారులు ఏడాదిగా ఎదురు చూస్తున్నారు. ఆర్థిక తోడ్పాటు అందించే వ్యాపారాలు చేసుకుంటూ స్వయం ఉపాధి పొందుదామనుకున్న వారికి రుణమందకుండా ఉంది. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి లబ్ధిదారులకు రుణాలు అందించి తోడ్పాటును అందివ్వాలి.



వైద్య కళాశాలల ప్రయివేటీకరణ తగదు : వైసిపి

అంబేద్కర్ సర్కిల్‌లో రోడ్డుపై కుర్చోని ఆందోళన చేస్తున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

పేద, మధ్యతరగతి విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసే వైద్య కళాశాలల ప్రయివేటీకరణ చర్యలను వెంటనే ఆపాలని వైసిపి నాయకులు డిమాండ్ చేశారు. వైసిపి అధిష్టానం ఆదేశాల మేరకు ఆపార్టీ నాయకులు అంబేద్కర్ సర్కిల్ లో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వైసిపి నాయకులు గుడ్డంపల్లి వేణు రెడ్డి, మడకశిర ఇన్‌ఛార్జి ఈరలక్కప్ప మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో మంజూరైన వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేయడానికి కటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవడం సమంజసం కాదన్నారు. వైద్య కళాశాలల ప్రైవేటీకరణ ద్వారా సామాన్య, మధ్య తరగతి వర్గాల ప్రజలకు సరైన వైద్యం అందకపోవడమే కాకుండా ఆయా వర్గాల విద్యార్థులు వైద్య విద్యకు కూడా దూరమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలందరికీ నాణ్యమైన వైద్యం అందించాలని, ధనిక విద్యార్థులతో సమానంగా సామాన్య విద్యార్థులు కూడా వైద్య విద్యను అభ్యసించాలన్న ఉద్దేశ్యంతో అప్పట్లో జగన్మోహన్ రెడ్డి వైద్య కళాశాలలను మంజూరు చేశారన్నారు. అయితే ప్రస్తుతం కార్పొరేట్ శక్తులకు వైద్య కళాశాలలను ధారాదత్తం చేయడం వల్ల మధ్యతరగతి వర్గాలకు వైద్య విద్య అందని ద్రాక్షగా మిగులుతుందని వాపోయారు. కూటమి ప్రభుత్వం వైద్య విద్యను ప్రైవేటీకరణ చేసే చర్యలను మానుకుని, ప్రభుత్వ అధీనంలోనే కళాశాలలో నిర్మించాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాన్ని చేపడుతామని హెచ్చరించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు నరసింహమూర్తి, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు సూర్య మోహన్, రాష్ట్ర మైనారిటీ విభాగం కార్యదర్శి షేక్ అమానుల్లా, రాష్ట్ర మైనార్టీ విభాగం సంయుక్త కార్యదర్శి ఫరూక్, నాయకులు మలుగూరు శివన్న, బాపూజీ నగర్ శ్రీరాములు, అంబేద్కర్ నవీన్, నరసింహులు, అయూబ్ బేగ్, ఎరుకల శంకర, జంగం చందు, మేళాపురం రవి, హనుమంతరాయప్ప తదితరులు పాల్గొన్నారు.

నిజాంను వారంలో తీసుకొస్తాం

సౌదీ బాధితుడితో మాట్లాడిన 'అనంత' ఎమ్మెల్యే

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఉపాధి కోసం సౌదీ దేశానికి వెళ్లి అక్కడ చిక్కుకున్న అనంతపురానికి చెందిన నిజాంను వారంరోజుల్లో స్వస్థలానికి తీసుకొస్తామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. నగరంలోని ఆజాద్‌నగర్‌కు చెందిన నిజాం రెండు నెలల క్రితం ఉపాధి కోసం సౌదీ దేశానికి వెళ్లారు. అక్కడ ఓ ఇంట్లో డ్రైవర్‌గా చేరిన తర్వాత వేధింపులు మొదలయ్యాయి. ఓనర్లు నిత్యం దాడి చేస్తూ చిత్రహింసలకు గురిచేశారు. చివరకు అతన్ని బయటికి నెట్టివేయడంతో సౌదీలో కనీసం తినేందుకు తిండి కూడా లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చివరకు ఓ వీడియో సందేశం ద్వారా తన ఆవేదనను వెల్లడించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి తనను రక్షించాలని వేడుకున్నారు. ఈ వీడియో వైరల్‌గా మారడంతో అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ వెంటనే స్పందించారు. నగరంలోని ఆజాద్‌నగర్‌లో ఉన్న నిజాం ఇంటికి టిడిపి నాయకులతో కలసి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నిజాం సతీమణి రేష్మ కు ధైర్యం చెప్పారు. వెంటనే తన స్నేహితుల ద్వారా సౌదీలోని జెడ్డాలో ఉన్న నిజాంను కలిసేలా చేశారు. అనంతరం వారి ద్వారా ఆంధ్రప్రదేశ్ తెలుగు అసోసియేషన్ వారికి నిజాంను అప్పజెప్పారు. జెడ్డా నుంచి సౌదీ రాజధాని రియాద్‌కు నిజాంను తీసుకొచ్చారు. అక్కడ నుంచి అనంతపురం తీసుకొచ్చేందుకు అవసరమైన అన్ని అంశాలు అధికారులతో మాట్లాడారు. అయితే నిజాం ఎందుకు సౌదీకి వెళ్లారన్నా అంశాలను ఎమ్మెల్యే దగ్గుపాటి ఆరా తీశారు. గతంలో పదేళ్లపాటు సౌదీలో డ్రైవర్‌గా పని చేసేవారని.. తిరిగి అనంతపురం వచ్చి ఇక్కడే ఉన్నారని తెలిపింది. ఇటీవల తమ కుమారుడికి కిడ్నీ ఆపరేషన్ చేయడం వల్ల రూ.12లక్షలు అప్పులు అయ్యాయన్నారు. వీటిని తీర్చేందుకు మళ్లీ రెండు నెలల క్రితం ఆయన సౌదీకి వెళ్లినట్లు వివరించారు. ఈ సంఘటనపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే దగ్గుపాటి వైద్య ఖర్చులకు అయిన సొమ్మును సీఎంఆర్ఎఫ్ ద్వారా అందించే ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే సొంత ఇల్లు కూడా మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. నిజాం ఇబ్బందుల గురించి తెలిసిన వెంటనే మంత్రి నారా లోకేష్ ఢిల్లీలో బిజీగా ఉన్నప్పటికీ తన కార్యాలయ సిబ్బందిని తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు తెలిపారు. ఇప్పటికే నారా లోకేష్ కార్యాలయ సిబ్బంది కూడా నిజాంతో మాట్లాడారని తెలిపారు. కచ్చితంగా వారం రోజుల్లోపు అనంతపురం తీసుకొస్తామని వారి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గౌస్ మొద్దిన్, రాయల్ మధు, సరిపుటి రమణ, సుధాకర్ యాదవ్, నారాయణస్వామి యాదవ్, బొమ్మినేని శివ, తాజుద్దీన్,జనబలం బాబా, ఫిరోజ్ అహ్మద్, చేపల హరి, ఇస్మాయిల్, పూల భాష, ఓంకార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిజాం కుమారుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే



పైపులైన్ లీకేజీ వల్ల వృథా అవుతున్న నీరు

తాగునీరు వృథా అవుతున్నా స్పందించరా..?

ప్రజాశక్తి-ముదిగుబ్బ

మండలంలోని దొరిగల్లు గ్రామ సచివాలయం ముందు పార్నపల్లి-కదిరి మున్సిపాలిటీ పైపులైన్ కొన్ని నెలలుగా లీక్ అవుతూ తాగునీరు వృథా అవుతోంది. పైపులైన్ లీకేజీ వల్ల వృథా అవుతున్న నీరు ఇప్పటికే పెద్దఎత్తున చెరువులోకి చేరింది. ఈ విషయంపై ఇప్పటికే సంబంధిత మున్సిపల్ అధికారులు, సచివాలయం సిబ్బందికి తెలిపినా ప్రయోజనం లేదని ప్రజలు పేర్కొంటున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేసి నీటి వృథాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఇసుక రీచ్, చెక్‌పోస్ట్ తనిఖీ

ప్రజాశక్తి-బత్తలపల్లి

ఇసుక అక్రమ రవాణాను అరికట్టే చర్యల్లో భాగంగా మండలంలోని జ్వాలాపురం వద్ద ఏర్పాటుచేసిన చెక్‌పోస్ట్‌ను సోమవారం రాత్రి ఆర్డీవో మహేష్ రెవెన్యూ అధికారులు, పోలీసులతో కలిసి తనిఖీ చేశారు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టే చర్యలను పరిశీలించారు. ఇసుక తరలించే ప్రతి వాహనాన్ని ఆపి అనుమతి పత్రాలు తనిఖీ చేయాలని, ఆయా పత్రాలు లేని వాహనాలను సీజ్ చేయాలని ఆదేశించారు. అనంతరం రాత్రి 10:30 గంటల సమయంలో చిన్నచిగులరేవు ఇసుక రీచ్‌ను సందర్శించి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు టిప్పర్లు, రెండు హిటాచీలు, రెండు ట్రాక్టర్లను గుర్తించి పోలీసుల చేత సీజ్ చేయించారు. సంబంధిత అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని, ఇసుక అక్రమ రవాణా విషయంలో ప్రభుత్వ మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలని ఆర్డీవో ఆదేశించారు.

గ్రామకంఠం భూమిలోకి వెళ్తే క్రిమినల్ చర్యలు

ప్రజాశక్తి-రొద్దం

మండలంలోని గౌరాజుపల్లి గ్రామంలో రెండు రోజుల క్రితం చోటుచేసుకున్న గ్రామకంఠం భూమి వివాదంపై అధికారులు మంగళవారం గ్రామంలో దండోరా వేయించారు. సిఆర్‌పిసి-145 ఆంక్షలు అమలులో ఉన్నాయని, ఆ గ్రామ కంఠం భూమిలోకి ఎవరు వెళ్లినా క్రిమినల్ చర్యలు తప్పవని తహశీల్దార్ ఉదయశంకర్‌రాజ్, ఎస్‌ఐ నరేంద్ర స్పష్టం చేశారు.

అసాంఘిక కార్యకలాపాలను రూపుమాపాలి

ప్రజాశక్తి-కదిరి అర్బన్

అసాంఘిక కార్యకలాపాలను పూర్తిస్థాయిలో రూపుమాపాలని ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ పోలీసు అధికారులను ఆదేశించారు. విధి నిర్వహణలో, ఫిర్యాదుదారుల పట్ల ఏమాత్రం అలసత్వంగా వహించ కుండా నిబద్ధతతో నేరాల నియంత్రణపై దృష్టి సారించాలని సూచించారు. ఎస్పీ మంగళ వారం పట్టణంలోని డీఎస్పీ కార్యాలయం, పట్టణ, రూరల్ పోలీస్ స్టేషన్లు, రూరల్ సర్కిల్ కార్యాలయాలను సందర్శించారు. రిసెప్షన్ కౌంటర్, లాకప్ గదులు, మహిళా హెల్ప్ డెస్క్, పట్టుబడిన ద్విచక్ర వాహనాలు, పోలీస్ స్టేషన్ల పరిసర ప్రాంతాలను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. పెండింగ్ కేసులపై ఆరా తీశారు. కదిరి సబ్ డివిజన్ పరిధిలోని పోలీస్ స్టేషన్లలో ప్రధానంగా ఆయా ప్రాంతాల్లో నమోదవుతున్న కేసులు, శాంతి భద్రతల సమస్యల గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు. అమలు చేయాల్సిన కార్యాచరణపై దిశా నిర్దేశం చేశారు. ప్రధానంగా మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రాధాన్యత కల్పించాలన్నారు. రాత్రివేళ గస్తీ ముమ్మరం చేయడంతో పాటు విజిబుల్ పోలీసింగ్ చేపట్టాలన్నారు. ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా చూడాలన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ విస్తృతంగా చేపట్టాలన్నారు. రాత్రిపూట గ్రామాలను సందర్శించి(నైట్ హాల్ట్) చేసి శక్తి యాప్, బాల్య వివాహాలు, సైబర్ నేరాలు, మోసాల తీరును వివరించి ప్రజలు సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా అవగాహన కల్పించాలన్నారు. మట్కా, గంజాయి, జూదం, మద్యం అక్రమ రవాణాను సమూలంగా అరికట్టేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. రౌడీ షీటర్స్‌పై ప్రత్యేకంగా నిఘా పెట్టాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ట్రాఫిక్ నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. సిబ్బంది విధులు, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఏదైనా సమస్య ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకురావచ్చని సిబ్బందికి సూచించారు. ఎస్పీ వెంట డీఎస్పీ శివనారాయణస్వామి, సిఐలు డి.వి.నారాయణ రెడ్డి, నాగేంద్ర, నిరంజన్‌రెడ్డి, ఎస్‌ఐలు ఉన్నారు.

ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్

కదిరి పోలీస్ స్టేషన్ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

సమస్యలపై పిహెచ్‌సి వైద్యుల ధర్నా

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

తమ న్యాయమైన సమ్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పిహెచ్‌సి) వైద్యులు మంగళవారం పట్టణంలోని డిఎంఅండ్‌హెచ్‌ఒ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ముందుగా వారు డిఎంహెచ్‌ఒ కార్యాలయం ఎదుట రోడ్డుపై బైఠాయించి నినాదాలు చేశారు. జిల్లాలోని పిహెచ్‌సి వైద్యాధికారులు వైద్య సేవలను బహిష్కరించి నిరవధిక సమ్మెలో పాల్గొన్నారు. వారికి ఎపి పిహెచ్‌సి వైద్యుల సంఘం నాయకులు, బహుజన చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు శివరామకృష్ణ మద్దతు తెలుపుతూ సమ్మెలో పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాజేంద్ర మాట్లాడుతూ ఇన్ సర్వీస్ పిజీ కోటాను పునరుద్ధరించాలని, టైం బౌండ్ ప్రమోషన్లు ఇవ్వాలని, నేషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని, గిరిజన ప్రాంతాల్లో పని చేస్తున్న వైద్యులకు 50 శాతం మూలవేతనం గిరిజన భత్యంగా ఇవ్వాలని, తదితర డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. క్లిష్ట సమయాల్లో కూడా ప్రజలకు సేవలు అందిస్తున్న తమ డిమాండ్లను ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణం అన్నారు. ఆయా డిమాండ్లను రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ దృష్టికి కూడా తీసుకెళ్లామన్నారు. అయినా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతోనే నిరవధిక సమ్మెకు దిగామన్నారు. తమ డిమాండ్లను పరిష్కరించేంద వరకూ సమ్మెను విరమించేది లేదని స్పష్టం చేశారు.

డిఎంహెచ్‌ఒ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు

వైద్యాధికారులు వెంటనే విధుల్లో చేరాలి.. నోటీసులు జారీ చేశాం : డిఎంహెచ్‌ఒ

కలెక్టర్, కమిషనర్ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్ విజయవాడ ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న ప్రభుత్వ వైద్యులు సమ్మెను విరమించి వెంటనే విధులకు హాజరు కావాలని జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ ఫిరోజ్‌బేగం మంగళవారం ఓ ప్రకటనలో ఆదేశించారు. జిల్లా ప్రజలకు వైద్య సేవల్లో ఎలాంటి ఆటంకం కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. జిల్లాలోని పట్టణ ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా హాస్పిటల్స్‌కు అనంతపురం మెడికల్ కళాశాల నుంచి 20 మంది వైద్యాధికారులను పిలిపించి వారితో అన్ని సేవలు సజావుగా అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వైద్యం ప్రజల అత్యవసర సేవల కిందకు రావడంతో ఇలాంటి సేవలకు ఎలాంటి భంగం కలగకుండా ఉండేందుకు ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఎపి కండక్ట్ సర్వీస్ రూల్స్ ప్రకారం ఇలా చేయడం చట్టరీత్యా అనుమతించబడదని, అందుచేత వైద్యాధికారులకు నోటీసులు మంజూరు చేసినట్లు తెలిపారు. కావున వెంటనే వైద్యాధికారులు విధులకు హాజరు కావాలని లేనిచో సీసీఏ రూల్స్ ప్రకారం చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కావున వైద్యులు మానవతా దృక్పథంతో విధులకు హాజరు కావాలని కోరారు.

'టెట్'పై రివ్యూ పిటిషన్ వేయాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి-కదిరి టౌన్

ఇన్ సర్వీస్‌లో ఉండే ఉపాధ్యాయులందరూ టెట్(టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్) రాయాలని ఇటీవల సుప్రీం కోర్టు తీర్పు వెలువరించిందని, దీనిపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రివ్యూ పిటిషన్ వేయాలని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి చెన్నూర్ తాహెర్‌వలి కోరారు. పట్టణంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ 2009లో కేంద్ర ప్రభుత్వం విద్యాహక్కు చట్టం చేయడంతో విద్యా హక్కు చట్టం అమలులోకి వచ్చిందన్నారు. ఆ చట్టంలోని సెక్షన్-23లో ఉపాధ్యాయుల అర్హతలను నిర్దేశించిందన్నారు. అందులో 1 నుంచి 8వ తరగతి బోధించే ఉపాధ్యాయులకు టెట్‌తో పాటు అకడమిక్ ప్రొఫెషనల్ క్వాలిఫికేషన్ అర్హతలు ఉండాలని ఉందన్నారు. అలాగే ఎన్‌సీటీఈ నామ్స్‌లో టీచర్ అపాయింట్‌మెంట్ కోసం అర్హతలను నిర్ణయించిందన్నారు. అప్పటిలోగా అన్‌ట్రెయిన్డ్ టీచర్స్ ఉంటే వారు ఐదేళ్ల లోపు తగిన అర్హతలు పొందాలని తెలియజేసిందన్నారు. ఆ గడువును విడతల వారీగా 2009, 2015, 2017 లోగా పూర్తి చేయాలని సూచిస్తూ గడువును ముగించిందన్నారు. 2017లో ఆర్‌టిఈ సూచన ప్రకారం ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులందరూ కచ్చితంగా టెట్ ఉత్తీర్ణత పొందాలని సూచించలేదన్నారు. ఎందుకంటే 2009 కంటే ముందు ఉపాధ్యాయులందరూ అప్పటి రాష్ట్ర ప్రభుత్వాలు నిర్దేశించిన అర్హతలు, ఎన్‌సీటీఈ నామ్స్ ప్రకారం నియమితులైన వారన్నారు. వారు పూర్తిస్థాయి ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు అర్హత సాధించినవారన్నారు. 2010లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జీవో-51 విడుదల చేసినా అందులో ఇన్ సర్వీస్‌లో ఉండే ఉపాధ్యాయులు టెట్ రాయాలని సూచించలేదన్నారు. ఆ తర్వాత కూడా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇన్ సర్వీస్‌లో ఉండే ఉపాధ్యాయులు టెట్ ఉత్తీర్ణత కావాలని సూచించలేదన్నారు. అయితే సుప్రీంకోర్టు 2023 మద్రాస్ హైకోర్టు స్కూల్ అసిస్టెంట్ ప్రమోషన్లకు(తమిళనాడు రాష్ట్రంలో) టెట్ అర్హత ఉండాలని సూచించడం, అలాగే మహారాష్ట్రలో కొన్ని మైనార్టీ విద్యాసంస్థల నియామకాల విషయంపై టెట్ ఉత్తీర్ణతతో నియామకాలు చేయాలని సూచించిందన్నారు. కావున సుప్రీంకోర్టు ఇచ్చిన మేరకు ఇన్ సర్వీస్ టీచర్లు టెట్ రాయాలనే విషయంపై రివ్యూ పిటిషన్ వేయాలని యుటిఎఫ్ పక్షాన ప్రభుత్వాన్ని కోరారు.

చెన్నూర్ తాహెర్‌వలి
యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

ప్రజాశక్తి-తనకల్లు

ప్రమాదంలో మృతిచెందిన శ్రీనివాసులు

టమోటా లోడుతో వెళ్తున్న వాహనం ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న సంఘటనలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన మంగళవారం మండలంలోని చీకటిమానిపల్లి సమీపంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ గోపి తెలిపిన వివరాలు.. పాతర్లపల్లి శ్రీనివాసులు(30) ద్విచక్ర వాహనంపై పాతకోట నుంచి సింగిరివాండ్లపల్లికు వెళుండగా అదే సమయంలో ఎంసి తండాకు చెందిన ఆదినారాయణనాయక్‌కు చెందిన టమోటా లోడుతో వెళ్తున్న వాహనం చీకటిమానిపల్లి సమీపంలో ఢీకొంది. ఈ సంఘటనలో శ్రీనివాసులు తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలిసిన వెంటనే ఎస్‌ఐ గోపి పోలీసు సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన టమోటా లోడుతో వెళ్తున్న వాహనం డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మరో ప్రమాదంలో గాయపడిన యువకుడు..

ప్రజాశక్తి-గుడిబండ

వారం రోజుల క్రితం కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన యువకుడు బెంగళూరులోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా సోమవారం రాత్రి మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వివరాలు.. మండలంలోని ఎస్.రాయపురం గ్రామానికి చెందిన సద్దాంహుస్సేన్(30) వారం రోజుల క్రితం భార్యాపిల్లలతో కలిసి కర్నాటక రాష్ట్రంలోని సిరా పట్టణం నుంచి ద్విచక్ర వాహనంపై స్వగ్రామం బయల్దేరాడు. మార్గ మధ్యలో అగళి మండలంలోని హుల్లెకెర సమీపంలో మారెమ్మ గుడి వద్ద రోడ్డు పక్కన ద్విచక్ర వాహనాన్ని ఆపి మూత్ర విసర్జన కోసం పక్కనే ఉన్న పొలంలోకి వెళ్లాడు. అదే సమయంలో ఓ కారు అతివేగంగా దూసుకొచ్చి మూత్ర విసర్జన చేస్తున్న సద్దాం హుస్సేన్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సద్దాం హుస్సేన్‌ను బంధువులు బెంగళూరులోని విక్టోరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సద్దాం హుస్సేన్ సోమవారం రాత్రి మృతి చెందాడు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నట్లు తెలిసింది. యువకుడు మృతితో ఎస్.రాయపురం గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

పొలాల్లో కేబుల్ వైర్లు చోరీ

ప్రజాశక్తి-బుక్కపట్నం

మండలంలోని గూనిపల్లి గ్రామంలో రైతులు వ్యవసాయ మోటార్లకు బిగించిన కేబుల్ వైర్లు ఇటీవల కాలంలో తరచూ చోరీకి గురవుతున్నాయి. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. సోమవారం రాత్రి ఆ గ్రామానికి చెందిన 12 మంది రైతుల వ్యవసాయ బోరు బావులకు సంబంధించిన కేబుల్ వైర్లను గుర్తుతెలియని వ్యక్తులు కట్ చేసి ఎత్తుకెళ్లారు. దీంతో రైతులు పంటలను కాపాడుకునేందుకు నానా అవస్థలు పడుతున్నారు. ఇకనైనా పోలీసు అధికారులు స్పందించి కేబుల్ వైర్ల దొంగలను పట్టుకుని రైతులకు న్యాయం చేయాలని రైతులు కేశప్ప, కిష్టప్ప, నారాయణ స్వామి, రమేష్, రఘునాథ్‌రెడ్డి, తదితరులు కోరుతున్నారు.

మంత్రి సవితకు మొక్క అందిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, ఎస్పీ సతీష్‌కుమార్

మంత్రి సవితను కలిసిన కలెక్టర్, ఎస్పీ

ప్రజాశక్తి-పెనుకొండ

రాష్ట్ర బిసి సంక్షేమ, చేనేత జౌళి శాఖల మంత్రి ఎస్.సవితను జిల్లా నూతన కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ మంగళవారం పట్టణంలోని రోడ్లు భవనాల శాఖ అతిథి గృహంలో వేర్వేరుగా కలిశారు. ముందుగా వారు మంత్రికి మొక్కలు అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లా సమగ్రాభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని కలెక్టర్‌కు సూచించారు. జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణలో రాజీ పడకుండా విధులు నిర్వహించాలని ఎస్పీని ఆదేశించారు.

పత్తి చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న కూటమి నాయకులు

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం

ప్రజాశక్తి-బుక్కపట్నం

కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమవుతుందని రాష్ట్ర ఇరిగేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ పత్తి చంద్రశేఖర్ పేర్కొన్నారు. కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన పత్తి చంద్రశేఖర్‌ను మంగళవారం కూటమి నాయకులు బుక్కపట్నంలో పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. చంద్రశేఖర్ మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ విశేష కృషి చేస్తున్నారని తెలిపారు. ఇరిగేషన్ శాఖ ద్వారా సాగునీటి కాలువల మరమ్మతులకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో సాగునీటి సంఘం ఉపాధ్యక్షులు సంజీవరాయుడు, టౌన్ కన్వీనర్ ఎర్రకేశప్ప, జనసేన నాయకులు అనిల్, దాసరి శ్రీనివాసులు, జయరామ్, మన్సూర్, సతీష్, వెంకటరాముడు, భాస్కర్, గణేష్, మంజు, శివ, తదితరులు పాల్గొన్నారు.

నేడు గుడిబండలో ప్రజావేదిక

ప్రజాశక్తి-గుడిబండ

స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ఆవరణంలో బుధవారం ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించను న్నట్లు ఎంపిడిఒ కేశవరెడ్డి, ఎపిఒ జగదీష్ తెలిపారు. మండల వ్యాప్తంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు, కన్వర్జెన్సీ పనులకు సంబంధించి 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి క్షేత్రస్థాయిలో సామాజిక తనిఖీ బృందాలు తనిఖీ చేశాయి. ఆయా గ్రామ పంచాయతీల పరిధిలోని తనిఖీ బృందాలు సమర్పించిన నివేదికలను ప్రజావేదికలో సమర్పిస్తారని తెలిపారు. మండలంలోని సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పకుండా హాజరు కావాలని వారు కోరారు.

శ్రీధన్వంతరి జయంతిని అధికారికంగా నిర్వహించాలి

ప్రజాశక్తి -పెనుకొండ టౌన్

శ్రీధన్వంతరి జయంతిని ప్రభుత్వ కార్యక్రమంగా జరపాలని అనంతపురం జిల్లా నాయీ బ్రాహ్మణ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం పట్టణంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి సవితను ఆ సంఘం ఆధ్వర్యంలో మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ శ్రీధన్వంతరి జయంతిని ప్రభుత్వ కార్యక్రమంగా నిర్వహించడానికి చొరవ చూపాలని కోరారు. స్పందించిన మంత్రి ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అతి త్వరలో జీవో రావడానికి తగిన చర్యలు తీసుకుంటానని తెలిపారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షులు సుబ్రహ్మణ్యం, అధ్యక్షులు వెంకటరంగయ్య, కార్యదర్శి శివశంకర్, గౌరవ సలహాదారు శివప్రసాద్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఉమామహేశ్వరీ, కోశాధి కారి నాగరాజు, రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆర్టీసీ శ్రీనివాసులు, అనంతపురం రూరల్ ఎంపిడిఒ దివాకర్, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సవితను కలిసిన అనంతపురం జిల్లా నాయీ బ్రాహ్మణ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు

ఘనంగా దుర్గాష్టమి వేడుకలు

ప్రజాశక్తి-బుక్కపట్నం

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక చౌడేశ్వరీ, వాసవీమాత ఆలయా ల్లో దుర్గాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చౌడేశ్వరీ ఆలయంలో సర్పంచి నాగలక్ష్మిరాజు ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో భక్తు లకు అన్నదానం ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం చౌడేశ్వరీమాత ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి గ్రామ వీధుల్లో ఊరేగించారు.

దుర్గామాత అలంకారంలో అమ్మవారు

దుర్గాదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు

కొత్తచెరువు : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగం గా తొమ్మిదవ రోజు దుర్గాష్టమి సందర్భంగా కొత్తచెరువమ్మ, కన్యకా పరమేశ్వరి ఆలయాల్లో కొలువైన అమ్మవారు దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు అమ్మవారిని వివిధ రకాల పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శనం చేసుకున్నారు. పుట్టపర్తి మున్సిపల్ కమిషనర్ క్రాంతికుమార్ అమ్మవారిని దర్శనం చేసుకున్నారు.

సిఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ

ఆత్మకూరు : నియోజకవర్గంలోని దాదాపు 29 మంది లబ్ధిదారులకు సిఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.38.27 లక్షల చెక్కులను మంగళవారం వెంకటాపురంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పరిటాల సునీతమ్మ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అనారోగ్యానికి గురై స్తోమతకు మించి అప్పులు చేసి ప్రయివేటు, కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకున్న బాధితులకు సిఎం సహాయ నిధి వరం అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ శ్రీనివాసులు, నాయకులు శశాంక్‌చౌదరి, కందుల ఓబుళపతి, పూల ఓబుళపతి తదితరులు పాల్గొన్నారు.

యువతకు క్రీడా సామగ్రి అందజేస్తున్న లక్ష్మీనారాయణయాదవ్

వాలీబాల్ కిట్ అందజేత

ప్రజాశక్తి-చిలమత్తూరు

మండల టిడిపి సీనియర్ నాయకుడు లక్ష్మీనారాయణయాదవ్ మంగళవారం వాలీబాల్ క్రీడాకారులకు కిట్ అందజేశారు. మరవకొత్తపల్లి యువతను క్రీడారంగంలో ప్రోత్సహిస్తూ సొంత ఖర్చుతో వాలీబాల్ కిట్ కొనుగోలు చేసి అందజేశారు. యువతలో క్రీడాస్ఫూర్తి పెంపొందించాలనే ఉద్దేశ్యంతో ఈ కిట్ పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. యువతను క్రీడల్లో ప్రోత్సహిస్తున్న లక్ష్మీనారాయణయాదవ్‌ను పలువురు అభినందించారు.

హోటళ్లను తనిఖీ చేస్తున్న కమిషనర్ క్రాంతికుమార్

హోటళ్లు, బేకరీలు తనిఖీ

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

మున్సిపాలిటీ పరిధిలోని పలు హోటళ్లు, బేకరీలను మంగళవారం మున్సిపల్ కమిషనర్ క్రాంతికుమార్ తనిఖీ చేశారు. పరిశుభ్రత పాటించాలని, ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించామని ఎవరూ వాడరాదని సూచించారు. ఇంకా పలువురు ప్లాస్టిక్ వాడటంపై అసహనం వ్యక్తం చేశారు. ఇకపై ప్లాస్టిక్ వాడితే జరిమాణా విధిస్తామని హెచ్చరించారు. హోటళ్లలో వంటగదిని శుభ్రంగా ఉంచుకోవాలని, పుట్టపర్తి పవిత్రతను కాపాడాలని సూచించారు. దేశ, విదేశాల నుంచి ఎంతోమంది సత్యసాయి బాబా మహాసమాధి దర్శనార్థం వస్తుంటారని, వారికి రుచికరమైన, కల్తీ లేని పదార్థాలను విక్రయించాల న్నారు. సద్ది పడిన పదార్థాలను వాడకూడదన్నారు. అనంతరం కమిషనర్ చికెన్ సెంటర్లను తనిఖీ చేశారు. పరిశుభ్రత పాటించడంతో పాటు శుభ్రమైన మాంసాన్ని విక్రయించాలని మిగిలిపోయిన చికెన్‌ను ఫ్రిజ్‌లో పెట్టి మరుసటి రోజు అమ్మకాలు చేయరాదన్నారు. హోటళ్లలో ప్లాస్టిక్ గ్లాసులు వాడరాదని హెచ్చరించారు.

మున్సిపాలిటీ వార్డుల పునర్విభజనపై ప్రజాభిప్రాయ సేకరణ

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

మున్సిపాలిటీలో వార్డుల పునర్విభజనపై ప్రజలు అభిప్రాయాలు తెలపాలని కమిషనర్ క్రాంతికుమార్ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పుట్టపర్తి మున్సిపాలిటీలో ప్రస్తుతం 20 వార్డులు ఉండగా మరో 7 వార్డుల పునర్విభజనకు ప్రభుత్వం ఆదేశించిందన్నారు. దీనిపై ప్రజల అభిప్రాయ సేకరణకై అన్ని ప్రభుత్వ కార్యాలయాల వద్ద నోటీస్ బోర్డులు ఉంచుతామన్నారు. వారం రోజుల్లో ప్రజలు తమ అభిప్రాయాలను మున్సిపల్ కార్యాలయంలో తెలుపవచ్చు అన్నారు. దీంతో ఇకపై మున్సిపాలిటీలో 27 వార్డులు కానున్నట్లు సమాచారం.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ఉమ్మడి అనంతపురం జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉచితంగా శిక్షణ ఇచ్చి వారికి ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తామని సీడాఫ్ కోఆర్డినేటర్ ఆంజనేయులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 19 నుంచి 26 ఏళ్ల యువతీ, యువకులకు డిఆర్‌డిఎ సీడాఫ్, నైపుణ్యాభివృద్ధి సంస్థ సంయుక్తంగా కంప్యూటర్, స్పోకెన్ ఇంగ్లీష్, ఎగ్జిక్యూటివ్ కోర్సుల్లో అనుభవజ్ఞులైన అధ్యాపకులతో శిక్షణను ఇస్తుందన్నారు. 90 రోజుల శిక్షణ కాలంలో ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పిస్తారన్నారు. ఇంటర్ చదివిన నిరుద్యోగ యువత అక్టోబర్ 6వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతపురంలోని టీటీడీసీ శిక్షణ కేంద్రంలో శిక్షణ ఇస్తామన్నారు. ఆసక్తి ఉన్న వారు వివరాలకు 96408 99337లో సంప్రదించాలన్నారు.

ఎన్‌ఎంఎంఎస్ టెస్ట్‌కు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-కొత్తచెరువు

డిసెంబర్ 7వ తేదీ నిర్వహించే నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్‌ఎంఎంఎస్) పరీక్షకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని డిఇఒ జి.కృష్ణప్ప మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అప్లికేషన్ ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటుందన్నారు. స్టేట్ బ్యాంకులో చలానా తీసిన రశీదుతో పాటు దరఖాస్తును డిఇఒ కార్యాలయంలో అక్టోబర్ 18వ తేదీ లోపు అందజేయాలన్నారు. జడ్పీ, మున్సి పల్, ఎయిడెడ్, మోడల్, ఎంపియుపి పాఠశాలల విద్యార్థులు అర్హులన్నారు. ఏడో తరగతిలో 55 శాతం మార్కులు ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం మార్కులు ఉండాలన్నారు. వార్షిక ఆదాయం రూ. 3.5 లక్షల లోపు ఉండాలన్నారు. ఓసీ, బీసీ విద్యార్థులకు రూ.100, ఎస్సీ, ఎస్టీలు రూ.50 ఫీజు చెల్లించాలన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ

ప్రజాశక్తి-చిలమత్తూరు

కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని సోమఘట్ట పంచాయతీ చెరువుకిందపల్లి గ్రామంలో టిడిపి, జనసేన పార్టీల నాయకులు లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఇందులో భాగంగా అంజి, సోము స్టోర్ వద్ద లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు అందజేశారు. నాయకులు మాట్లాడుతూ గత ప్రభుత్వం పంపిణీ చేసిన రేషన్ కార్డుల్లో పార్టీ జెండా రంగులు, నాయకుల ఫొటోలు ఉన్నాయని, దీంతో కూటమి ప్రభుత్వం వాటిని రద్దు చేసి నూతనంగా స్మార్ట్ రేషన్ కార్డులు తెచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ శ్రీనివాసులు, జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.వి.రమణ, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ అగ్గి శ్రీనివాసులు, గౌరీశంకర్, ప్రధాన కార్యదర్శి లక్ష్మణమూర్తి, వెంకటాద్రి, తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేస్తున్న కూటమి నాయకులు

IN THE COURT OF THE JUNIOR CIVIL JUDGE: MADAKASIRA
O.S.NO.237/2024

Between:
Eranna ...**Plaintiff**

AND

Smt.Yasodamma ...**Defendant**

SUMMONS TO DEFENDANT

Smt.Yasodamma W/o Narasegowd, D/o Papanna, aged about 33 years, Hindu, Vegetable business, R/O Gowdanahalli Village, Madakasira Mandal, Sri Sathya Sai Dt.

Medam,

Please take summons that the plaintiff filed suit against you on the file of Junior Civil Judge Court, Madakasira and the same is posted to 09-10-2025 for your appearance. If you got any objections you can appear either in person or through advocate during working hours. Otherwise the matter will be decided ex-parte.

Hearing Date: 09-10-2025
Place: Madakasira Court

(By Order of the Court)
K.C.UMESH CHANDRA
Advocate Madakasira-515301
Cell: 9440648145